క్లుప్తంగా

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను చోటు చేసుకోవని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు శక్తియాప్, 112, సైబర్ నేరాల టోల్‌ఫ్రీ నంబర్ 1930, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండి జూనియర్లతో సోదరభావంతో మెలగాలని సూచించారు. చిన్న పిల్లలు బైక్, ఇతర వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అస్కారం ఉందన్నారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయని, వీటిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని వివరించారు. శక్తి టీం ఏఎస్‌ఐ నాగరాజు, కరస్పాండెంట్ గఫూర్, హెచ్‌ఎం పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాటనీ (వృక్షశాస్త్రం) బోధించేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీలో పీజీ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.375 చొప్పున నెలకు గరిష్ఠంగా రూ.27 వేలు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ ఒరిజినల్, జిరాక్స్ ధ్రువపత్రాలతో ఈ నెల 23వ తేదీ కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని పేర్కొన్నారు.

పరామర్శ



చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సూరపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. బీటెక్ అభ్యసిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు అఖిలేశ్వర్‌రెడ్డి నరాలకు ఇన్‌ఫెక్షన్ సోకడంతో రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కనకాద్రిపల్లెలో ఆ కుటుంబాన్ని పరామర్శించి విద్యార్థి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని చంద్రశేఖరరెడ్డిని ఓదార్చారు.


ప్రజావ్యతిరేక విధానలపై పోరాటం



పట్టణంలో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకుడు రంగనాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. శనివారం ఆ పార్టీ 7వ మండల మహాసభ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పెట్రోల్ బంకు మీదుగా పట్టణంలోని పలు ప్రధాన రోడ్ల మీదుగా ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి హామీలు, చేసిన మోసాలపై ప్రజానాట్యమండలి కళా ప్రదర్శన ఆకట్టుకుంది. నాయకులు సుబ్బారెడ్డి, సుంకయ్య, సంజీవులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

బిహార్ వాసికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు, రైల్వే పోలీసులు

డోన్ టౌన్: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి మృతి చెందిన బిహార్ వాసికి ద్రోణాచలం సేవా సమితి సభ్యులు శనివారం హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. బేతంచెర్ల సమీపంలో శుక్రవారం రాత్రి డోన్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న అమరావతి రైలు నుంచి పడి బిహార్ వాసి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించాలని ద్రోణాచలం సేవా సమితి వారిని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. సమితి సభ్యులు షాదిఖానా రాజా, గురుస్వామి, తాహెర్‌బాషా, రైల్వే జీఆర్పీ పోలీసులు మధు, సుధాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం..

విద్యార్థులకు శాపం

- ప్రభుత్వ బడిలో విద్యార్థులకు అరకొర భోజనం
- నిర్వాహకులపై తల్లిదండ్రుల ఫిర్యాదులు
- నాయకుల ఒత్తిళ్లకు లొంగి చర్యలు తీసుకోని అధికారులు
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం దూరం



ఇటీవల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించిన ఎంఈఓ సోమశేఖర్(ఫైల్)

బేతంచెర్ల: అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రతీ అంశాన్నీ రాజకీయం చేస్తూ ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్న కూటమి ప్రభుత్వం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, వెలుగు బుక్ కీపర్లు వంటి పదవులను తమ అనుచరులకు కట్టబెడుతూ అధికారులను ఒత్తిడికి గురిచేస్తోంది. జేబులు నింపుకునే దానిపై పెడుతున్న శ్రద్ధ నాణ్యత విషయంలో చూపడం లేదు. బేతంచెర్ల మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. వంట ఏజెన్సీ నిర్వాహకురాలైన నాగలక్ష్మమ్మ విద్యార్థులకు అరకొరగా అన్నం పెడుతోందని అడిగితే, మీకు దిక్కున్నచోట చెప్పుకోండని, తన వెనుక అధికార పార్టీ నాయకులు ఉన్నారని బెదిరింపులకు పాల్పడుతోందని తెలిపారు. పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సరైన భోజనం అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఎంఈఓకు ఫిర్యాదు చేసినా..

ఈ విషయంపై తల్లిదండ్రులు ఎంఈఓ సోమశేఖర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన జూలై 3న హెచ్‌ఎం జ్యోత్స్న సమక్షంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా తల్లిదండ్రుల అభిప్రాయానికి అనుగుణంగా నాగలక్ష్మమ్మ స్థానంలో హెడ్ కుక్‌గా కాశమ్మ, అసిస్టెంట్ కుక్‌గా ప్రభావతిని ఎంపిక చేశారు. ఈ నిర్ణయాన్ని ఎంపీడీఓ ఆమోదం కోసం పంపినప్పటికీ రాజకీయ ఒత్తిడుల వల్ల ఈ మార్పులు అమలుకాలేదు. దీంతో న్యాయం కోసం తల్లిదండ్రులు జూలై 14న నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావేదికలో కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలపై డీఈఓ జనార్దన్‌రెడ్డి స్పందించి సమస్యను పరిశీలిస్తానన్నారు. అయితే ఇంకా పాఠశాల సందర్శన జరగకపోవడంతో విద్యార్థుల హాజరు పడిపోయింది. గత మూడురోజులుగా విద్యార్థులు స్కూల్‌కు రాకుండా ఉండగా, శనివారం కేవలం తొమ్మిది మంది మాత్రమే హాజరయ్యారు. ఈ విషయంలో 16 రోజులు గడిచినా నిర్ణయం అమలుకాలేదని, మళ్లీ నోటీసులు ఇచ్చినట్టు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే రాజకీయ ఒత్తిడులను అధిగమించి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన భోజనం అందించేందుకు వెంటనే నాగలక్ష్మను తొలగించాలని తల్లిదండ్రులు జిల్లా స్థాయి ఉన్నతాధికారులను కోరుతున్నారు.



పాఠశాలకు శనివారం 9 మంది మాత్రమే హాజరైన విద్యార్థులు

తల్లిదండ్రుల అభిప్రాయాలకు ఇచ్చే గౌరవం ఇదేనా



మా పిల్లలకు మధ్యాహ్నం భోజనం అరకొరగా పెడుతున్నారని ఎంఈఓకు ఫిర్యాదు చేశాం. ఎంఈఓ గ్రామానికి వచ్చి అభిప్రాయం చెప్పాలని తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అందరం వంట ఏజెన్సీ నిర్వాహకురాలిని తొలగించాలని సంతకాలు చేశాం. అందరి అభిప్రాయాల మేరకు కొత్త వారిని ఎన్నుకున్నాం. అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాతవారిని తొలగించలేదు. ఇదేనా తల్లిదండ్రుల అభిప్రాయాలకు ఇచ్చే గౌరవం. అధికారులు మా పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారు.

–సంజీవ రాయుడు,విద్యార్థి తండ్రి

పిల్లలకు అరకొరగా భోజనం



కొమ్మూరి కొట్టాల ప్రాథమిక పాఠశాలలో మా కుమార్తె 5వ తరగతి చదువుతోంది. వంట ఏజెన్సీ నిర్వాహకురాలు అరకొరగా పెట్టే భోజనం సరిపోక ఇబ్బంది పడుతోంది. భోజనం ఎందుకు పెట్టడం లేదని అడిగినందుకు మాపై గొడవకు దిగింది. దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు గురి చేస్తోంది. చివరకు మా పాప పాఠశాలకు వెళ్లనని మారం చేస్తోంది. చేసేదేమి లేక పాఠశాలకు పంపడం లేదు. కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– మద్దిలేటి, విద్యార్థిని తండ్రి

ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై అవగాహన



కోవెలకుంట్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి



బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, తదితరులు



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఆర్డీఓ, కమిషనర్



డోన్‌లో విద్యార్థులకు అవగాహన

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ‘ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన’ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలు ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ఖాళీ వాటర్‌బాటిళ్లు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు వాటిని తొలగించాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు నరేంద్రనాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, రమణారెడ్డి, కృష్ణశశాంక, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధులు దూరం

బనగానపల్లె: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి అన్నారు. బనగానపల్లెలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మనవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ రాధికరెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, మండల అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

బేతంచెర్ల: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డోన్ ఆర్డీఓ నరసింహులు, మండల ప్రత్యేక అధికారి బశీరున్నిసా బేగం అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది, పొదుపు మహిళలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. వైద్యురాలు సాగరిక, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు, డీటీ మారుతి, కౌన్సిలర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

- **ప్యాపిలి:** మన పరిసరాలను మనమే స్వచ్ఛతగా ఉంచుకోవాలని స్పెషల్ ఆఫీసర్ హరినాథ్ రెడ్డి, తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విధానానికి స్వస్తి పలకాలన్నారు.
- **డోన్ టౌన్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, హెచ్‌ఎం మైమున్నీసా, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

23న సర్వసభ్య సమావేశం

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ’ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

- **ప్యాపిలి:** స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దాం

కోవెలకుంట్ల: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ ప్రధాన అర్చకుడి మృతి



వేణుగోపాలాచార్యులు(ఫైల్)

కోవెలకుంట్ల: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు సంబటూరి వేణుగోపాలాచార్యులు(64) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. 45 ఏళ్ల పాటు ఆలయ అర్చకుడిగా పనిచేశారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ దేవాలయాల అర్చకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నెలాఖరు వరకు పోలీస్ యాక్ట్

డోన్ టౌన్: శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు డోన్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉండనుందని డోన్ డీఎస్పీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, బనగానపల్లె, అవుకు మండలాల్లో ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు పోలీసు 30యాక్ట్ అమల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, ఊరేగింపులు, బంద్‌లు చేయకూడదని స్పష్టం చేశారు. ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే పైపులైను వైఎస్ నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద లీకేజ్ ఏర్పడడంతో ఈ నెల 21, 22 తేదీల్లో చిగురమానుపేట నీటి ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రభావంతో పట్టణంలోని 12, 13, 14, 15, 16, 17వ వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని, జూలై 23 నుంచి మళ్లీ యథావిధిగా నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కమిషనర్ సూచించారు.

కూటమి హామీలన్నీ మోసమే



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- హామీల అమల్లో పూర్తిగా విఫలం
- అధికారం కోసమే కూటమి నాయకుల తాపత్రయం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజం
- అవుకులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశం

అవుకు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ‘ఇది చేసాం, అది చేసాం’ అని ప్రచారం చేసుకుంటోందే తప్ప, ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. శనివారం అవుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని, పార్టీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డిలతో కలిసి ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ’ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు ‘సూపర్ సిక్స్’ పథకాలు అంటూ హామీల పల్లకిని ఎక్కించి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడిచారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500, అన్నదాత సుఖీభవ వంటి హామీలు ఒక్కటీ అమలు కాలేదని, తల్లికి వందనం పథకంలో కోతలు విధించారని విమర్శించారు. కొత్త పింఛన్ల గురించి మాటే లేకుండా పోయిందని, హామీలు అడిగిన వారిపై కేసులు బనాయించడం కూటమి అసహనానికి నిదర్శనమన్నారు.

రైతుల పరిస్థితి మరీ దారుణం

రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, పంట సాగు చేయాలన్నా నీరు, గిట్టుబాటు ధర లేదని, అప్పులు తెచ్చి పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నదాతలకు అండగా నిలిచారని తెలిపారు. కూటమి పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థితికి వెళ్లిపోతున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇప్పటివరకు జీఎన్‌ఎస్‌ఎస్ కాలువకు నీళ్లు వదలకపోవడం తీరని నిర్లక్ష్యమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కాకుండా ‘రెడ్‌బుక్ రాజ్యాంగం’ పేరిట వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని చిత్రహింసలకు గురిచేస్తోందని ఆరోపించారు. అనేక మంది కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీకి కార్యకర్తలే బలం అని, వారిని ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా పార్టీని వీడరని స్పష్టం చేశారు. కార్యకర్తల కోసం అవసరమైతే పోలీస్ స్టేషన్లను ముట్టడించడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని వడ్డీతో సహా చెల్లిస్తామని తెలిపారు.

చల్లా, కాటసాని కుటుంబాలు ఒక్కటే

ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. బనగానపల్లె నియోజకవర్గంలో చల్లా, కాటసాని కుటుంబాలు వేరుకాదని, ఒకటేనని స్పష్టం చేశారు. దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి ప్రజల సాగునీటి కోసం, కొండమీద ప్రజల అవసరాల కోసం హైడ్రో ప్రాజెక్ట్ అవసరం ఉందని భావించి చర్యలు చేపట్టారని, ఆయన కోరిక మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హైడ్రో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందని గుర్తు చేశారు. అయితే కూటమి నాయకులు ప్రాజెక్టుకు కప్పం అడిగి గుత్తేదారులను బెదిరించడంతో వారు వెనక్కు తగ్గారని, ప్రజల ప్రయోజనాల కోసం ఉన్న ప్రాజెక్టును కాసులకు కక్కుర్తి పడి అడ్డుకోవడం తగదన్నారు. రాబోయే కాలంలో చల్లా, కాటసాని కుటుంబాలు కలిసి అవుకు మండల అభివృద్ధికి శ్రమిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర కార్యదర్శి రామన్న, నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వాయునందనగౌడ్, నర్సిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, పేరం వెంకట సుబ్బారెడ్డి, ఫుల్లారెడ్డి, నాగేశ్వర రెడ్డి, తల్లం సుబ్బు, రామిరెడ్డి, అయ్యప్పరెడ్డి, పురుషోత్తం నాయుడు, లక్ష్మానాయక్, రమేష్ రెడ్డి, గోపవరం గోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వలి, కొడితం జగదీష్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- రూ.13 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో శనివారం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఉంచిన రూ.13 లక్షల విలువైన రసాయన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏఓ భూమా జ్యోతి మాట్లాడుతూ.. ఆకుమల్లలో నాలుగు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అనుమతులు లేని 19 రకాల బయో మందులను గుర్తించామన్నారు. వాటి విక్రయాలను నిలుపుదల చేశామని తెలిపారు. నిలుపుదల చేసిన బయో మందులకు సంబంధించి వారంలోగా అనుమతి పత్రాలను జతపరచకుంటే వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతి ఉన్న మందులను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు.

అక్రమార్కుల నిర్వాకంతో జలమయం



జలమయమైన రామకృష్ణాపురంలోని ఓ వీధి

ప్యాపిలి: గ్రామ శివారులోని వంకను ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ కట్టడాల కారణంగా రామకృష్ణాపురం జలమయమైంది. భారీ వర్షాలు కురిస్తే వచ్చే వరద నీరు గ్రామ శివారులోని వంకలోకి ప్రవహించేవి. అయితే మూడేళ్ల క్రితం గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు ఎనిమిది అడుగుల వెడల్పుతో ఉన్న వంకకు ఆనుకుని ఇళ్లను నిర్మించుకోగా మరి కొందరు వంకకు అడ్డంగా రాళ్లకట్ట నిర్మించారు. దీన్ని గ్రామస్తులు ఎన్నిసార్లు తొలగించినా సదరు వ్యక్తులు రాళ్లకట్ట మళ్లీ నిర్మిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా శనివారం గ్రామంలో భారీ వర్షం కురవడంతో గ్రామంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. నీరు బయటకు వెళ్లడానికి అవకాశం లేక పోవడంతో గ్రామంలో వీధులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీరోడ్డు ప్రారంభం

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలను ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. అనంతరం రీసర్వే సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీరాములు పాల్గొన్నారు.

మురుగు సమస్య తీరింది

సాక్షి ఎఫెక్ట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఎట్టకేలకు మురుగు సమస్య తీరింది. గ్రామంలో రోడ్డుపైకి మురుగు నీరు వచ్చి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ఈ నెల 18న‘మురుగు పారదు–సమస్య తీరదు’అన్న శీర్షికతో సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఎన్నో రోజుల సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఆకుమల్ల ఏరాశి వెంకటరామిరెడ్డి కాలనీలో మురికి కాల్వను శుభ్రం చేసిన దృశ్యం